చదువు

కార్పొరేట్ రంగంలో అద్భుతమైన ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రావడంతో మేనేజ్‌మెంట్ కెరియర్ అత్యంత ఆకర్షణీయంగా మారింది. రాష్ట్రంలో ఐసెట్ ద్వారా ఎంబీఏలో చేరిన విద్యార్థులకు ఇటీవలే తరగతులు ప్రారంభమయ్యాయి. రెండేళ్ల కోర్సు పూర్తయ్యే సరికి విద్యార్థులు పూర్తి స్థాయి వృత్తి నిపుణులుగా తయారైతేనే మంచి అవకాశాలను అందుకోగలరు. దీనికి కళాశాలల నుంచి విద్యార్థులకు చాలా పోత్సాహం అవసరం. అలాగే విద్యార్థులు అన్నిటికీ, పూర్తిగా కళాశాలల మీదే ఆధారపడకుండా సామర్థ్యాలు పెంపొందించుకోవడానికి అనేక రకాలుగా కృషి చేయాలి.



# ఎంబీఏ
## రెండేళ్లలో 'రెఢీ' ఎలా?

మేనేజ్‌మెంట్ కోర్సులకు డిమాండ్ పెరుగుతుండటంతో రాష్ట్రంలో కళాశాలలు బాగా విస్తరించాయి. విద్యార్థులు తాము ఊహించుకున్న దానికి భిన్నంగా కళాశాలలుంటే నిరాశపడటం సహజం. ర్యాంకులు, సీట్లు, కళాశాలల పరిస్థితి ఎలా ఉన్నా, కోర్సులో ప్రవేశించాక వాటి గురించి చింతించడం వల్ల ప్రయోజనం ఉండదు. వచ్చే రెండేళ్లలో కళాశాలలో సౌకర్యాలను, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపైనే ఇక దృష్టి పెట్టాలి. దాన్నిబట్టే తర్వాత కాలంలో ఉద్యోగావకాశాలు ఆధారపడి ఉంటాయి.

ముందుగా కళాశాలలో మీరు నేర్చుకోవడానికి ఏ మేరకు అవకాశాలు ఉన్నాయో పరిశీలించాలి. తరగతులు ప్రారంభమయ్యాయి కాబట్టి ఈ దశలో అంచనా వేయడం కష్టం కాదు! మీపై కళాశాల పెట్టే పెట్టుబడి, మీరు చేసే కృషిపైనే రెండేళ్ల తర్వాత ఏ మేరకు పరిశ్రమలకు మీరు పనికొస్తారనేది తేలిపోతుంది. కళాశాల యాజమాన్యం స్వభావాన్ని కూడా విద్యార్థి అర్థం చేసుకోవాలి. ఏదైనా అంశంలో లోపాలుంటే పరిస్థితిని బట్టి స్వయంగా వాటిని అధిగమించడానికి విద్యార్థి ప్రయత్నించాలి.



జి.ఆర్.రెడ్డి
ఎం.డి., Husys

### బోధనలో నాణ్యత ఉంటే...

కోర్సు కాలంలో మిమ్మల్ని బాగా ప్రభావితం చేసేది అధ్యాపకులే. మిమ్మల్ని మంచి సామర్థ్యాలు గల విద్యార్థిగా తీర్చిదిద్దడంలో మంచి అర్హతలు, అనుభవం ఉన్న అధ్యాపకులకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అధ్యాపకులకు మేనేజ్‌మెంట్ సంబంధిత పరిశ్రమలతో, కంపెనీలతో సంబంధాలుంటే, వారి నుంచి మీరు చాలా విషయాలు నేర్చుకోవచ్చు.

⁜ ఒకవేళ మీరు చేరిన కళాశాలలో అనుభవజ్ఞులు, పరిశ్రమలతో మంచి సంబంధాలు ఉన్న అధ్యాపకులు పెద్దగా లేకపోతే ఆ మేరకు మీరు అధికంగా శ్రమించాల్సిందే! మీరే స్వయంగా పరిశ్రమలపై అవగాహన పెంపొందించుకోవాలి. దీనికోసం పరిశ్రమల్లో మీకు తెలిసినవారు, వారికి పరిచయం ఉన్నవారి సహాయం కూడా తీసుకోవచ్చు.

### మౌలిక సౌకర్యాలు లేకపోతే...

కళాశాలలో గడిపే రెండేళ్ల కాలంలో విద్యార్థి సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలి. వీటిలో ఇంటర్నెట్, కోర్సుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లు, మంచి గ్రంథాలయం, ప్రాజెక్టులు చాలా ముఖ్యమైనవి. ఇవన్నీ ఉన్నంత మాత్రాన సరిపోదు. విద్యార్థికి నేర్చుకోవాలనే తపన ఇందులో కీలకం. ఇది లేకపోతే ఎన్ని సౌకర్యాలున్నా వృథానే! విద్యార్థులకు సొంత కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే మరీ మంచిది. ఒక్కరికే సాధ్యం కాకపోతే, కొంతమంది విద్యార్థులు కలిసి కంప్యూటర్ ఏర్పాటు చేసుకోవచ్చు.

⁜ కళాశాలలో మీరు ఆశించిన స్థాయిలో, అవసరమైన మౌలిక సౌకర్యాలు లేకపోతే వాటి కోసం ఎదురు చూడవద్దు. కళాశాల వెలుపల ప్రత్యామ్నాయాలు వెతుక్కోవడం మంచిది. మీ తెలివితేటలు, అవగాహన పెంచుకోవడానికి ప్రభుత్వ గ్రంథాలయాలు, స్వచ్ఛంధ సంస్థలు చాలా ఉపయోగపడతాయి. ఆన్‌లైన్ లైబరీలు, ఉచితంగా సాఫ్ట్‌వేర్‌లను వాడుకోవడానికి అనుమతించే వెబ్‌సైట్లు కూడా ప్రయోజనకరం. ఇతర కళాశాలల్లో చదివే వారితో కూడా పరిచయాలు ఏర్పరచుకుని, బృందంగా ఏర్పడితే ఇలాంటి విషయాలు తేలిగ్గా తెలుస్తాయి.

### మేనేజ్‌మెంట్‌కు దార్శనికత... విద్యార్థికి స్పష్టత

కళాశాల, విద్యార్థి అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన అంశం... యాజమాన్యం దార్శనికత (విజన్). విద్యార్థి మీద పెట్టుబడి పెట్టడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే యాజమాన్యం చేతుల్లోని కళాశాలలు అభివృద్ధి సాధిస్తాయి. వాటిలోని విద్యార్థులు సమగ్ర వ్యక్తిత్వంతోపాటు మేనేజ్‌మెంట్ కెరియర్‌కు అవసరమైన వ్యాపార లక్షణాలను పెంపొందించుకోగలుగుతారు. భారీగా ఫీజులు చెల్లించినట్లయితే... యాజమాన్యం హామీలకు సరితూగే సౌకర్యాలు పొందడం విద్యార్థుల హక్కు కూడా.

⁜ మేనేజ్‌మెంట్ దార్శనికతతోపాటు విద్యార్థికి కెరియర్ పట్ల స్పష్టమైన దృక్పథం అవసరం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలలో అందుబాటులో ఉన్న వనరులను విద్యార్థి సమర్థంగా వినియోగించుకోవాలి. మేనేజ్‌మెంట్ స్వభావాన్ని అర్థం చేసుకొని, సాధ్యమైనంత మేరకు ప్రయోజనం పొందడానికి ప్రయత్నించాలి.

### అక్కరకొచ్చే... ఎం.డి.పి.

పరిశ్రమల్లో పనిచేస్తోన్న వారికోసం మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎం.డి.పి.) పేరుతో కొన్ని కళాశాలలు స్వల్ప వ్యవధి కోర్సులను నిర్వహిస్తుంటాయి. ఇలాంటి ప్రోగ్రామ్‌ల ద్వారా విద్యార్థులకు కూడా చాలా ప్రయోజనం ఉంటుంది. పరిశ్రమలకు చెందిన నిపుణులను కలిసి మాట్లాడవచ్చు. పరిశ్రమల్లో అనుభవం ఉన్నవారు అధ్యాపకులుగా వచ్చే అవకాశం ఉంటుంది.

⁜ మీ కళాశాలతోపాటు దగ్గర్లోని ఇతర కళాశాలల్లో నిర్వహించే ఎం.డి.పి.లను కూడా పరిశీలించాలి. వాటిలో ఏ అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు, శిక్షకులు ఎవరో తెలుసుకోవాలి. వాళ్లు మీ కళాశాలకు కూడా వచ్చినప్పుడు మాట్లాడి పరిచయం పెంచుకోవచ్చు.

### ప్రాణావసరం... పరిశోధన

ఏ విద్యాసంస్థకైనా పరిశోధన ప్రాణావసరం లాంటిది. కళాశాలలో పరిశోధనల వల్ల విద్యార్థులకు అనేక అంశాల్లో మంచి పునాది ఏర్పడుతుంది. ఇతర విద్యాసంస్థల్లో పరిశోధన సమాచారాన్ని కూడా సేకరిస్తే మంచిది. ఇలాంటి సమాచారాన్ని క్రోడీకరించి కేస్ స్టడీలను తయారుచేయవచ్చు. ప్రసార మాధ్యమాల దగ్గర లభించే పరిశోధన పత్రాలను కూడా సేకరించండి. అవి భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడతాయి.

### కళాశాల సత్తా తెలిపే సంబంధాలు

పరిశ్రమలతో కలిసి కళాశాలలు సదస్సులు, సెమినార్లు, టెక్నాలజీ, వ్యాపారాలకు సంబంధించిన చర్చలు నిర్వహించవచ్చు. నిపుణుల అనుభవం, వారితో చర్చల ద్వారా విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. పరిశ్రమల నుంచి కేస్ స్టడీలను, నిపుణులను, అధ్యాపకులను కళాశాలకు రప్పించగల సత్తా కళాశాలకు ఉండాలి.

⁜ ఈ విషయంలో కళాశాల పరిస్థితి ఆశాజనకంగా లేకపోతే... మీ ప్రయత్నంగా మీరుండే నగరంలో పరిశ్రమలకు సంబంధించిన ఏదైనా సంఘంలో చేరవచ్చు. అలాంటి సంఘాలు నిర్వహించే సదస్సులు, చర్చలకు హాజరుకావచ్చు. వీటి ద్వారా కంపెనీల్లో పనిచేసే ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్‌లతో పరిచయాలు ఏర్పరచుకోవాలి.

### పూర్వ విద్యార్థులతో ప్రయోజనం

మీరు చేరిన కళాశాలకు మంచి పూర్వ విద్యార్థుల సంఘం ఉంటే కొంతవరకు మీకు శ్రమ తగ్గినట్టే! మేనేజ్‌మెంట్ కెరియర్‌లోకి ప్రవేశించాలన్న లక్ష్యం చాలావరకు నెరవేరినట్లే! ఎందుకంటే పరిశ్రమలు, కంపెనీలకు మీ కళాశాల ప్రతిభా పాటవాలు దీని ద్వారానే స్పష్టంగా తెలుస్తాయి.

⁜ పూర్వ విద్యార్థుల సంఘం లేకపోతే... కొంతమంది విద్యార్థులు కలిసి దీన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించవచ్చు. ఇతర కళాశాలలను కూడా దీనికి అనుసంధానం చేయవచ్చు. గతంలో కళాశాలలో చదివిన విద్యార్థులు, పనిచేసిన అధ్యాపకులు, పరిశ్రమలకు చెందిన వారిని కూడా ఈ సంఘంలో చేర్చడానికి ప్రయత్నించాలి. వారిని కళాశాలకు ఆహ్వానించి మేనేజ్‌మెంట్ కెరియర్‌పై విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరవచ్చు.

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరిన విద్యార్థులందరూ తమ తమ కళాశాలల్లో ఈ బలాలు, బలహీనతలను స్వయంగా అంచనా వేసుకోవాలి. వాటి ఆధారంగా కార్యాచరణను తయారుచేసుకోవాలి. తద్వారా కోర్సు పూర్తయ్యేటప్పటికి మెరుగైన కెరియర్‌ను ఆశించవచ్చు!